# పండుగ బహుమతి!

* రచన : శ్రీమతి పచ్చిగోళ్ళ సుధ *



(రచయిత్రి)

(గతసంచిక తరువాయి)

వస్తారనుకున్న అల్లుళ్ళు రానేవచ్చారు. ఆ వెంటే పండుగ వచ్చింది. పిండివంటలతో తృప్తిగా భోజనంచేసి కూతుళ్ళూ, అల్లుళ్ళూ కార్డ్స్ ఆడుకుంటున్నారు. ఆ తృప్తి కరమయిన భోజనానికి కారణం రెండు ఇత్తడి గిన్నెల విలువలే అని తెలుసుకునే స్థితిలో వాళ్ళులేరు. మూడు రోజులూ గడిచాయి.

అల్లుళ్ళు వెళ్ళడానికి ప్రయాణమవుతున్నారు.

మాధవరావులో కంగారు అధికమయింది అటూ ఇటూ తిరుగుతున్నాడు పిచ్చోడిలా!

'నాన్నగారూ! మీ అల్లుడుగారు వెళ్ళడానికి ప్రయాణ మవుతున్నారు. టైమయిపోతుందని కంగారు పెడుతున్నారు' అంది రాజ్యలక్ష్మి!

'అమ్మా రాజ్యం! అల్లుడుగారిని వెళ్ళనీ రెండు రోజులు పోయాక ఆ బహుమతి ఏదో నీకిచ్చి పంపిస్తాను' అన్నాడు ఆమె పలుకరింపుకి అర్థం తెలిసిన మాధవరావు.

'లేదు నాన్నగారూ! వెళ్ళగానే ఆయన ఫ్రెండ్స్ అంతా మీ మామగారు పండుగ బహుమతి ఏమిచ్చారని అడుగుతారట! మీరిచ్చే బహుమతి ఏదో యిప్పుడే యిచ్చేయండి.'

మరు మాట్లాడలేకపోయాడు. ఆలోచించగా...ఆలోచించగా ఏదో స్ఫురించినట్లు గబగబా వంటింటివైపు దారి తీసాడు మాధవరావు.

'మీనాక్షీ!'

'ఏమండీ! కాఫీ కావాలా?'

'వద్దు...వద్దు...కడుపు నిండుగా వుంది.'

'మరేం కావాలి?'

'మరి...మరి...'

'నా దగ్గర మొహమాటమేంటి చెప్పండి!'

'ఏంలేదు మీనాక్షీ...ఏంలేదు.'

'ఏదో దాస్తున్నారు. కష్టసుఖాలు పంచుకోవలసింది భార్యా భర్తలేనండి! మీరు చెప్పకపోతే నా మీద ఒట్టే!'

'మీనాక్షి!'

'చెప్పండి!'

'నన్ను క్షమించు మీనాక్షి! నేను చేతకానివాడ్ని. అసమర్థుడ్ని' ఆవేశంగా అన్నాడు.

'అవేం మాటలండీ! అసలేమయిందో చెప్పండి' బ్రతిమాలింది.

'అల్లుళ్ళకు బహుమతి ఇవ్వాలి. నా దగ్గర ఏంలేదు. అందుకని...అందుకని...'

'నీ మం...గ...ళ...సూ...త్రా...లు...'

'అర్థమయిందండీ! దీనికింత బాధపడాలా? నాక్కావలసింది మీరండి. ఈ బంగారంకాదు. మీ చేత్తోనే ఆ పసుపు కొమ్ము కట్టి, యివి పట్టుకు వెళ్ళండి' అంది.

'నన్ను క్షమించు మీనాక్షీ!'

'అంతమాట అనకండి. ఇవిగో ఇవి తీసుకుని బజారుకు వెళ్ళండి.'



భార్య చేతిలోని సూత్రాలు అందుకుని బజారుకు నడిచాడు.

X X X

'సేట్ జీ! ఈ సూత్రాలు తీసుకుని డబ్బివ్వండి. చాలా అర్జెంటు' అంటూ కంగారు పెట్టాడు మాధవరావు.

'సేట్ జీ మాధవరా విచ్చిన సూత్రాలు గీటుపెట్టుకొని, మంచి బంగారమని నమ్మకం కుదిరాక ఐదువందల రూపాయలు అతని చేతిలో వుంచాడు.

అతనిచ్చిన నోట్లు కంగారుగా లెక్క పెట్టుకుని. వడివడిగా బయలుదేరాడు. అల్లుడికి ట్రైన్ దాటిపోతుందేమో నన్న కంగారుతో పరుగు పెట్టసాగాడు.

పరుగుతో ఆయాసం పెరిగింది. కాళ్లు పీకుతున్నాయి. ఒకే ఆలోచనతో పరుగెడుతున్నాడు. వెనగ్గా వస్తున్న లారీని కూడా గమనించలేదు.

అనుకోని విధంగా రెప్పపాటు సమయంలో లారీ మాధవరావుని గుద్దింది. అంతే! మాధవరావు లారీ ముందు చక్రంలో పడ్డాడు. తల చిట్లిపోయి రక్తం ప్రవహిస్తోంది. గిలగిల తన్నుకుని ప్రాణం వదిలాడు. రూపాయి కాగితాలు రక్తంలో తడిసి భయంకరంగా కన్పిస్తున్నాయి.

దారిన పోయేవారు లారీ డ్రైవర్ని తిట్టారు. వాళ్ళలో మాధవరావుని తెలుసున్న వ్యక్తి గబగబా అతని దగ్గరికి వచ్చి..ముక్కుకి అడ్డంగా చేయిపెట్టి చూసాడు. అప్పటికే అంతా అయిపోయిందని తెలుసుకున్నాడు. పరుగున మాధవరావు ఇంటికి వెళ్ళి ఈ వార్త చెప్పాడు.

మాధవరావు శవం దగ్గరకు చేరుకున్నారంతా.

రక్తపు మడుగులో పడివున్న భర్తను చూసి నిలువునా కంపించిపోయింది మీనాక్షి.

ఆమె దైన్యానికి ప్రతీకలా వుంది.

నిశ్శబ్దంతో కూడిన నిర్లిప్తత...

ఆ నిర్లిప్తతవెనుక మూగగా...ఘోరంగా ఓడిపోయిన అసహాయత!

ఇంతలోనే ఈ విపరీతమేమిటి?

ఎందుకిలా జరిగింది? ఎంత ఘోరం...

రాతిగుండె దేవుడు ఆయనలో ఆడుతున్నాడు.

అసలు దేవుణ్ణని ఏం లాభం?

ఈ మనుషులకి బుద్ధిలేదు. తన అల్లుళ్ళకి మనసులేదు ఇమ్మంటే మన బిడ్డలకోసం సంతోషంగా ఇచ్చేను. ఇలా నాకు శాశ్వతంగా దూరమయిపోతారనుకోలేదు. మీ అల్లుళ్ళకు ఏదయినా బహుమతి ఇస్తేగాని వెళ్ళనంటున్నారు... యిప్పుడేం చెయ్యమంటారో చెప్పండి? మీ అల్లుళ్ళు పెట్టే బాధకన్నా యిదే బాగుందనుకున్నారా? పిచ్చిదానిలా అరుస్తూ ఏడుస్తూనే వుంది.

అల్లుళ్ళూ...కూతుళ్ళూ మూగగా మిగిలిపోయారు.

'బాబూ, అల్లుళ్ళూ! ఈ పండుగ బహుమతిగా ఆయన శవాన్ని పట్టుకు వెళ్ళండి! నలుగురూ పంచుకోండి. మీ కోరికలతో ఆయన్ని హత్య చేసారు. మీ బహుమతి పిచ్చితో నాకు ఆయన్ని దూరం చేసారు. పండుగంటే కేవలం బహుమతి కోసం కాదు బాబూ! మీలాంటి అల్లుళ్ళలో ఏ ఒక్కరికి బుద్ధి వచ్చినా ఆయన ఆత్మ శాంతిస్తుంది. బాబూ! యిదే ఆకరి పండుగ. నన్ను ఒంటరిదాన్ని చేసిన పండుగ. వెళ్ళిరండి బాబూ!' ఆమె అలా ఏడుస్తూ ఏదేదో అంటూనే వుంది.

జరగవలసిన కార్యక్రమాలు జరుగుతూనే వున్నాయి.

ఈ సభ్య సమాజంలో ఇలాంటి అల్లుళ్ళు మామలను హత్య చేస్తుంటే మన చట్టం ఏంచేస్తుంది? వాళ్ళకి ఎలాంటి శిక్ష విధిస్తోంది? మనిషిలో మానవత్వం నశించి స్వార్థం పెచ్చురేగిపోతుంటే మనం ఏం చేస్తున్నాం? చూస్తూ ఊరుకున్నన్నాళ్ళూ ఇలాంటి మాధవరావులు ఎంతోమంది దూరమవుతూనే వుంటారు. కూతుళ్ళూ ఎదురు తిరగండి. అల్లుళ్ళ మనసులో మానవత్వం ఉదయించేలా చూడండి. పండుగ బహుమతి మనిషి ప్రాణం కాకూడదు. *